క్లుప్తంగా

అపరిచితుల మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ వికాస్

మిరుదొడ్డి(దుబ్బాక): బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్లు వికాస్, రాఘవులు కోరారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఏటీఎం సేవలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపరిచితుల మాటలను నమ్మి ఓటీపీ వంటి వివరాలను చెప్పొద్దన్నారు. అపరిచితులు ఫోన్‌లో అడిగే ప్రశ్నలకు వివరాలు చెప్పి బ్యాంకు ఖాతాలోని డబ్బులను పోగొట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేష్‌రెడ్డి, మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురాములు, బ్యాంకు మేనేజర్ జెమ్‌నాయక్ పాల్గొన్నారు.

తరలిన ఎక్సైజ్ స్టేషన్

హుస్నాబాద్: హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ప్రస్తుతం ఉన్న గాంధీ చౌరస్తాలోని భవనం నుంచి, 6వ వార్డు ఎల్లంబజార్‌లోని మరో భవనంలోకి తరలించినట్టు ఎక్సైజ్ సీఐ పవన్ సోమవారం తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, నంగునూర్ ప్రజలు గమనించి, సహకరించాలని సీఐ సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పంచముఖ లింగ సోమేశ్వర ఆలయ పునర్నిర్మాణం కోసం గ్రామానికి చెందిన పలువురు రూ.50వేలు విరాళం అందజేశారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ సుదగోని యాదగిరి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బానోత్ స్వామినాయక్ రూ.20,216, గుండెల్లి సంతోష్ రూ.15,116, గుండెల్లి రమేష్ రూ.15,115లు విరాళంగా అందించారు. ఆలయ కార్యదర్శి బాలరాజు, ఉపాధ్యక్షుడు లింగం, మాజీ ఎంపీటీసీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోరంలేక సమావేశం వాయిదా

బెజ్జంకి(సిద్దిపేట): కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ నిర్మల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తొమ్మిది మంది ఎంపీటీసీలు హాజరుకాలేదు. పలువురు అధికారులు మాత్రం పాల్గొన్నారు. దీంతో కోరంలేక సభ వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ నిర్మల, ఎంపీడీఓ లక్ష్మప్ప ప్రకటించారు. ఎంపీటీసీలకు సమాచారం ఇచ్చినప్పటికీ హాజరు కాలేదని త్వరలోనే మళ్లీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

బీజేపీ శ్రేణుల పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామికి బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. సోమవారం వారు స్వామికి క్షీరాభిషేకం చేసి కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ భారీ మెజార్టీతో గెలుపొందాలని మొక్కుకున్నారు. తమ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి నరేంద్రమోదీ మరోసారి ప్రధాన మంత్రి అవుతారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శంకర్‌బాబు, వీరాచారి, రాజున్‌నాయక్, శ్రీనివాస్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): 30 నెలలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ ప్లే స్కూల్‌కు పంపించాలని కోరుతూ చిన్నశంకరంపేటలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే ప్లే స్కూల్‌లో చిన్నారుల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. చిన్నారులకు పోషకాహారంతో అందించడంతో పాటు పాఠశాలపై శ్రద్ధ పెరిగేల కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం-3 టీచర్ నాగరాణి, చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



1992-93 బ్యాచ్ విద్యార్థులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1992-93లో కలిసి చదువుకున్న వాళ్లంతా 32ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో చాలా ఆనందంగా గడిపారు. చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకొని సందడి చేశారు. తమకు విద్యను బోధించిన ఆ నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

– మద్దూరు(హుస్నాబాద్)

గాలివాన బీభత్సం



ఇంటి పైకప్పు ఎగిరిపోయిన దృశ్యం

మండలంలోని కేశనాయక్‌తండా, మల్లంపల్లి గ్రామాల్లో గాలివాన బీభత్సానికి ఐదు ఇండ్లు కూలాయి. సోమవారం రాత్రి కురిసిన గాలివానకు కేశనాయక్‌తండా పరిధిలోని లచ్చానాయక్‌తండాలో భానోతు లోక్య ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. దీంతో ఇంటిలోని బియ్యం బస్తాలు తడిసి ముద్దాయి. అలాగే చెరువు ముందు తండా భానోతు రాజు ఇల్లు, మల్లంపల్లిలోని మరో మూడు ఇండ్లు దెబ్బతిన్నాయి. తమను ఆదుకోవాలని కోరారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)

ప్రహరీ కూలి ఇల్లు నేలమట్టం



రేకుల ఇంటిపై కూలిన గోడ

స్థానిక హనుమాన్ నగర్‌లో ఆదివారం కురిసిన వర్షానికి చెవిటి పద్మ అనే మహిళ నివసిస్తున్న రేకుల ఇంటిపై ప్రహరీ కూలి పడింది. ఆ సమయంలో ఆమెకు ఫోన్‌వస్తే ఇంటి బయటకు వచ్చి మాట్లాడుతుండగా పెద్ద శబ్దం వచ్చింది. తీరా ఇంటిలోకి చూడగా ప్రహరీ ఆమె ఇంటిపై పడడంతో రేకులు పూర్తిగా పగిలిపోయాయి. వంట సామగ్రితోపాటు ఇతర వస్తువులు పనికి రాకుండా పోయాయి. రూ.3లక్షల వరకు నష్టం జరిగిందని, ఆదుకోవాలని ఆమె వేడుకుంది.

– హుస్నాబాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

డీఎం హెచ్‌ఓ శ్రీనివాస్

కోహెడ(హుస్నాబాద్): సీజనల్ వ్యాధుల వల్ల ప్రబలే అంటువ్యాధులను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. మందుల పంపిణీ, రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని మందులను అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణుల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ శ్రీనివాస్, తరుణ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అందమైన చేతిరాత అందరికీ సాధ్యం



అవగాహన కల్పిస్తున్న అహ్మద్

ఎజాస్ అహ్మద్

దుబ్బాక: విద్యార్థులకు అందమైన చేతిరాతలో మెళకువలు నేర్పించి వారిని సమర్థులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నానని ప్రముఖ చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్ అన్నారు. గాయత్రి స్కూల్‌లో మే 25నుంచి జూన్ 3వరకు చేతిరాతపై నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందమైన చేతిరాతను అందరూ నేర్చుకోగలరన్నారు. వందలాది మంది చిన్నారులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలలో అందంగా రాయడంలో మెళకువలు నేర్పించామని చెప్పారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ



కవాతు చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

గజ్వేల్‌రూరల్: స్థానిక బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం సోమవారం 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కేడెట్లకు యోగాతో ప్రారంభమై కవాతు, ఆయుధాలు వినియోగించడంలో శిక్షణనిచ్చారు. సాయంత్రం సమయంలో క్రీడా పోటీలు నిర్వహించారని సుబేదార్ మేజర్ రామ్‌హరి తెలిపారు. రాజగోపాల్‌పేట వద్ద వంద మంది కేడెట్లు ఫైరింగ్ శిక్షణ పొందినట్లు ఎన్‌సీసీ అధికారులు నరోత్తం కుమార్, సంధ్యారాణి తెలిపారు. డాక్టర్ గౌతమి ఆరోగ్యం-పరిశుభ్రత, అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స చేసే విధానంపై అవగాహన కల్పించినట్లు క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ భవాని తెలిపారు.

యూట్యూబర్‌పై ఫిర్యాదు



ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ల నాయకులు

దుబ్బాకటౌన్: ఓ యూట్యూబ్ ఛానెల్ విలేకరిపై దుబ్బాక మండల మెడికల్ అసోసియేషన్, పీఎంపీ, ఆర్‌ఎంపీ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెడికల్ దుకాణాలు, ప్రథమ చికిత్స కేంద్రాలను బంద్ చేసి, నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన తెలిపారు. ఆర్‌ఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్లకొండ శ్రీధర్ మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి విలేకరి ముసుగులో తమను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీనివాస్‌ను, ఎస్‌ఐ గంగరాజును కోరారు.

చిహ్నాన్ని ఆమోదించాలి



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని మార్చాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ధర్మ సమాజ్ పార్టీ నుంచి ప్రతిపాదిస్తున్న చిహ్నాన్ని ప్రభుత్వం ఆమోదించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోల్ల రవిబాబు కోరారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రతిపాదించిన చిహ్నంలో ప్రసిద్ధిగాంచిన ఉస్మానియా యూనివర్సిటీ, డా.అంబేడ్కర్, పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క సారలక్కల చిత్రాలను రూపకల్పన చేశామన్నారు. కార్యక్రమంలో మంద జ్యోతి, ప్రసన్న, యాదగిరి, మల్లేశం, నర్సింహులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను విస్మరించారు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో బీఆర్‌ఎస్ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని, అది గుర్తించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో వ్యవహరించడం తగదన్నారు. తెలంగాణ కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రాణాలు పణంగాపెట్టి పోరాడి సాధించారని, ఇప్పుడు ఆయనపై అవాకులు చెవాకులు మాట్లాడడం సహించరానిదని వాపోయారు. దుబ్బాక ఉద్యమకారుల అడ్డా అని, వారి కుటుంబాలను బీఆర్‌ఎస్ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి సతీమణి సుజాత, సతీష్‌రెడ్డి, మనోహరరావు, రాజమౌళి, వెంకట నర్సింహారెడ్డి, కార్తిక, ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

హైవే పనులతో ప్రజలకు ఇబ్బందులు

- త్వరగా పనులు పూర్తి చేయండి
- మున్సిపల్ చైర్ పర్సన్ రజిత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: జాతీయ రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నేషనల్ హైవే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైవే పనులవల్ల ఆదివారం కురిసిన వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీల నిర్మాణాల కోసం తవ్విన కందకాల్లో వర్షం నీళ్లు చేరి దుకాణదారులు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయిందని, అలాగే దుకాణాల ఎదుట వేయించుకున్న బోర్లు రహదారుల పనుల్లోనే కలిసిపోయి నష్టానికి గురవుతున్నారని చెప్పారు.వర్షాలు పడే అవకాశం ఉన్నందున పనులపై అశ్రద్ధ వహించ కుండా, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులను త్వరగా పూర్తిచేయాలని రజిత అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ట్రాన్స్ కో ఏఈ శశిధర్‌రెడ్డి, కౌన్సిలర్లు వల్లపు రాజు, దొడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తిచేయండి



నీటి సంపును పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి
- కోహెడ హైస్కూల్ సందర్శన

కోహెడ(హుస్నాబాద్): పాఠశాలలో తాగునీటి వసతి కోసం నిర్మిస్తున్న నీటిసంపు పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి పూర్తి కావాలన్నారు. నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించి, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ వివరాల గురించి హెచ్‌ఎం మహమూద్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రంగనాథ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంజుల, ఎమ్‌ఆర్పీ సిబ్బంది రజిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూర్(సిద్దిపేట): నాయకమ్మ దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. చిన్నకోడూర్‌లోని నాయకమ్మ ఆలయ వార్షికోత్సవంలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలుచేసి వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నకోడూర్ మండలం అన్నిరంగాల్లోను ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు హరీశ్‌రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పీసీసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ సర్పంచ్‌లు ఉమేశ్‌చంద్ర, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శుభాకాంక్షలు..

దుబ్బాక: మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

రూ.50వేల సాయం..

గజ్వేల్: మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గిరిపల్లి గ్రామంలో కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్న ప్రణీత్‌కు మెరుగైన చికిత్స కోసం రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రస్తుత కౌన్సిలర్ శిరీష-రాజు రూ.20వేలు, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



చిన్నకోడూర్(సిద్దిపేట): పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



హరీశ్‌రావుకు ఆశీర్వచనం పలుకుతున్న వేద పండితులు

శతమానంభవతి..

సిద్దిపేటజోన్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలు నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలో అన్నదానం, ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావును పండితులు ఆశీర్వదించారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యేలు రసమయి, సతీశ్, ఎమ్మెల్సీలు దేశపతి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్మన్ మంజుల తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రణీత్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు పంపిణీ చేసిన సైకిళ్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాలు, తండా నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు హెచ్‌సీజీ (హైదరాబాద్ సైకిల్ గ్రూప్) బృందం సోమవారం 22సైకిళ్లు పంపిణీ చేసింది. మండలంలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాలకు అజ్జమర్రి గ్రామం నుంచి 20 మంది, ఫైజాబాద్ తండా నుంచి ఇద్దరు బాలికలు ఫైజాబాద్ ఉన్నత పాఠశాలకు ప్రతీ రోజు 3 కిలోమీటర్ల నడుచుకుంటూ వస్తారు. దీంతో సైక్లింగ్‌డే పురస్కరించుకొని హెచ్‌సీజీ బృందం విద్యార్థినులకు 22 సైకిళ్లు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం తారాసింగ్ తెలిపారు. దీంతో విద్యార్థులకు సౌకర్యంగా మారనుందన్నారు. హైదరాబాద్ నుంచి ఫైజాబాద్‌కు సైకిళ్లను తీసుకొనివచ్చేందుకు అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి సహకరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, శేఖర్, పాండురంగం పాల్గొన్నారు.